క్లుప్తంగా

వనం వెంకటేశునికి శేషవాహన సేవ

వెల్దుర్తి: రామళ్లకోట వనం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం స్వామి అమ్మవార్లకు శేష వాహన సేవ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వనం వెంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులను పుష్పమాలాంకృతుల్ని చేసి, వాహన మంటపంలో ఉన్న పెద్ద శేషవాహనంపై ఊరేగించారు. కరణం వెంకోబరావ్, వెంకటరమణరావ్, నాగరాజురావ్ సేవాకర్తలుగా వ్యవహరించారు.

ఈఏపీసెట్ ఉచిత శిక్షణ

మద్దికెర: ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి నిర్వహించే ఈఏపీసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో 33 రోజు ల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చొక్కా సునీల్ కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామీణ విద్యార్థిని, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 6 నుంచి మే 14వ తేదీ వరకు గుంతకల్లులోని ఇండియన్ బ్యాంకు వద్ద ఉన్న గౌతమ్ స్టడీ సర్కిల్ లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు 82474 52174, 90104 61033 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఈ నెల 5, 6 వ తేదీలలో నిర్వహించుకునే అవధూత పక్కీరప్ప తాత తిరునాల మహోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం ఆచార, సాంప్రదాయాలు ఎలా ఉన్నాయో అలాగే నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరు

కృష్ణగిరి: ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. గతంలో ఇక్కడి వారు డోన్‌లో పరీక్షలు రాయడం జరుగుతుండేదని, డోన్ నంద్యాల జిల్లాలోకి వెళ్లడంతో కృష్ణగిరికి సెంటర్ వచ్చినట్లు వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్షా కేంద్రం నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటలకు ఉంటుందన్నారు. ఈ పరీక్షను 150 మంది హాజరుకానున్నట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కృష్ణగిరి: మండల పరిధిలోని రామకృష్ణాపురం నుంచి టి.గోకులపాడుకు వెళ్లే రహదారిలోని ఓ చెట్టు కింద పేకాట ఆడుతున్న 10 మందిని ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రామకృష్ణాపురానికి చెందిన పెనికలపాటి శ్రీనివాసులు, కమ్మ రామకృష్ణ, గొల్ల దామోదర్, కోడుమూరుకు చెందిన పింజరి అబ్దుల్‌నబీ, గోరంట్లకు చెందిన కురువ రాముడు, బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన గొల్ల కొదండపాణి, ఎస్‌హెచ్ ఎర్రగుడికి చెందిన బి.శేఖర్‌రెడ్డి, వెల్దుర్తికి చెందిన బోయ వెంకట నాయుడు, కృష్ణాపురానికి చెందిన సుంకిరెడ్డి, గోకులపాడుకు చెందిన తూము లక్ష్మీకాంతరెడ్డిలను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి రూ.26,610లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పత్తికొండ రూరల్: పత్తికొండ మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామానికి చెందిన పింజరి లాలప్ప (35) ఆదివారం ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు. భార్యాభర్తల నడుమ మనస్పర్థలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దరఖాస్తులకు నేడు తుది గడువు

ఆలూరు రూరల్: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తులకు నేడు(సోమవారం) తుది గడువని ఆలూరు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి వీరేష్ తెలిపారు. ఆదివారం ఆయన పత్రిక ప్రకటన విడదల చేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటీవ్ (వాయిస్, నాన్ వాయిస్) కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పది, ఇంటర్ చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. వివరాల కోసం 9010003132 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించాలన్నారు.

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ట్రైనింగ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిగ్యూటీవ్ కోర్సులో శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 3వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ మాధురి తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం 8500783459 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఈ నెల 18 వరకు నిర్వహణ
- ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు
- పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు




నందవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం, ఆలూరు ప్రభుత్వ పాఠశాలలో డెస్కులకు రోల్ నంబర్లు అతికిస్తున్న సిబ్బంది

ఆలూరు రూరల్/నందవరం: పది పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నేటి నుంచి ఈ నెల 18వ తేది వరకు పరీక్షలు జరగనున్నాయి. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేటు విద్యార్థులు మొత్తం 3,806 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 305 మంది ప్రైవేటుగా ఫీజు చెల్లించి పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం నియోజకవర్గంలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి, చీఫ్‌తో పాటు ఆ కేంద్రంలో కేటాయించిన ప్రతి రూంకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున విధులు నిర్వహించనున్నారు. సెంటర్‌లోని ఒక రూముకు 24 నుంచి 30 మంది విద్యార్థులు పరీక్ష రాయడానికి కేటాయించారు. డెస్కుకు ఒక విద్యార్థి మాత్రమే కేటాయించారు. ఈ ఏడాది రోల్ నంబర్లు చాక్‌పీస్‌తో రాయకుండా.. స్టిక్కర్లను అతికిస్తున్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రాలకు పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు ఉచితంగా బస్సులను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్ కలిగిన విద్యార్థులు ఇందులో ఉచిత ప్రయాణం చేయవచ్చు.

పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు

పరీక్ష కేంద్రాల్లోని అన్ని రూముల్లో డెస్కులు, లైట్లు, తాగునీటి వసతి కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పాటు ప్రతి సెంటర్ వద్ద వైద్యారోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. గత ఏడాది జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మాస్ కాపింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు అకస్మికంగా తనిఖీ చేయనున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అర గంట ముందే చేరుకోవాలి. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ వెంట తెచ్చుకోవాలి. పరీక్ష సామగ్రి అయిన పెన్ను, పెన్సిల్, వంటివి తదితర వస్తువులు మాత్రమే లోపలికి అనుమతిస్తారు.

నందవరంలో 474 మంది పరీక్షలకు...

నందవరం మండలంలో 474 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 363 మంది రెగ్యులర్ విద్యార్థులు, 111మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 256 మంది, కస్తూర్బా పాఠశాలలో 93 మంది, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో 100 మంది పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో నాగలదిన్నె హైస్కూల్, నందవరం హైస్కూల్, కనకవీడు హైస్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు నందవరం మండల కేంద్రాలలో పరీక్షలు రాస్తారు. మిగిలిన ఇబ్రహీంపురం హైస్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులు మంత్రాలయంలోనూ, మోడల్ స్కూల్ 80 మంది, ముగతి హైస్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులు ఎమ్మిగనూరులో ఏర్పాట్లు చేసిన కేంద్రాలలో పరీక్షలు రాస్తారు. పరీక్ష కేంద్రాలకు ముగ్గురు చీఫ్ అధికారులు, డిపార్ట్‌మెంట్ అధికారులు ముగ్గురు, 27 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు.

- **చిప్పగిరి:** చిప్పగిరి మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మస్తాన్ రావు తెలిపారు. స్థానిక జెడ్పీహైస్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో మొత్తం 308 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు.
- **గోనెగండ్ల:** మండలంలో పది పరీక్షలకు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక(బస్టాండ్) పాఠశాలలో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలో 700 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, పరీక్ష కేంద్రల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.
- **మద్దికెర:** మండలంలో రెండు పరీక్షా కేంద్రాలలో 326 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ రంగస్వామి ఆదివారం తెలిపారు. మద్దికెర జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 146 మంది, ఆదర్శ పాఠశాలలో 180 మంది పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షా కేంద్రాలలో చీఫ్‌లుగా దేవేంద్రప్ప, ఎసెండీ ఫరూక్, డిపార్టమెంటల్ అధికారులు శివప్రసాద్, భీమలింగప్పలు ఉంటారన్నారు.
- **ఎమ్మిగనూరుటౌన్:** ఎమ్మిగనూరు పట్టణంలోని 12 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ ఆంజినేయులు పేర్కొన్నారు. స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాల్లో 490 మంది విద్యార్థులు, ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 260 మంది, ఎంఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 280 మంది, ఎస్ఎంఎస్ హైస్కూల్‌లో 260 మంది, లిటిల్‌ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో 150 మంది, వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో 220 మంది, ఉర్దూ హైస్కూల్‌లో 120 మంది, బాష్యం స్కూల్‌లో 260 మంది, నారాయణ స్కూల్‌లో 260 మంది, ఏపీఆర్ఎస్ బనవాసి పాఠశాలలో 360 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.
- **వెల్దుర్తి:** మండల వ్యాప్తంగా 11 జెడ్పీహైస్కూళ్లు, ఎస్సీ, బీసీ బాలికల గురుకులం, కేజీబీవీ గురుకులం, రెండు ప్రైవేట్ స్కూళ్లలోని 825 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. వీరందరికి మండల కేంద్రంలోని బాలుర, బాలికల హైస్కూళ్లు, ఎస్సీ గురుకులంలోని రెండు సెంటర్లు మొత్తంగా నాలుగు సెంటర్లు కేటాయించినట్లు వెల్లడించారు.
- **కృష్ణగిరి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కంబాలపాడు గ్రామంలోని గురుకుల బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. కృష్ణగిరి సెంటర్‌లో 250మంది, కంబాలపాడు గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల సెంటర్లలో 310 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు.

అరగంట ముందు రావాలి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందు వచ్చి వారికి కేటాయించిన గదులను చూసుకోవాలి.
–కోమలా దేవి, ఎంఈఓ, ఆలూరు

పకడ్బందీగా ఏర్పాట్లు



పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. పరీక్షలు పటిష్ఠంగా నిర్వహించేందుకు జెడ్పీహైచ్ఎస్‌కు 12మంది, కస్తూర్బా పాఠశాలలో 6 మంది, స్పెషల్ ప్రాథమిక పాఠశాలకు 7 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశాం. వీరితో పాటు చీఫ్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్లు ఇద్దరు చొప్పున ఏర్పాటు చేశాం. విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలి. –సుదర్శన్‌రెడ్డి, మండల విద్యాధికారి, నందవరం

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం



రమేష్‌రెడ్డి(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో రమేష్ రెడ్డి(31) అనే వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. ఎస్ఐ మహేషకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో పుండుకూర భాస్కర్‌రెడ్డి పెద్ద కుమారుడు కాప రమేష్‌రెడ్డి వ్యవసాయం చేసేవాడు. 8 ఎకరాల్లో మిరప, పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. శనివారం తండ్రితో కుమారుడు గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు. రమేష్ రెడ్డి రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లాడని అనుకున్నారు. మిరప పంట తీవ్రంగా నష్టం రావడంతో పాటు అప్పులు ఎక్కువగా ఉండడంతో తీవ్ర మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. ఆదివారం పొలాల్లో పనులకు వెళ్లిన కూలీలు మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారణ చేసి రమేష్‌రెడ్డి మృతదేహమని గుర్తించారు. మృతదేహన్ని కుటుంబ సభ్యులకు చూపించి పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నర్మద, కూతురు ఉన్నారు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు వెల్లడించారు.

యువకుడి అదృశ్యం



అదృశ్యమైన వెంకటేష్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ (24) అదృశ్యమైనట్లు ఆదివారం కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 29వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వెంకటేష్ ఇటీవలే పోలీసు పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు.

నేడు ఆసరా చెక్కు పంపిణీ

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న ఇబ్రహీం ఫంక్షన్ హాలులో సోమవారం మూడవ విడత ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏసీ నవీన్, ఏపీఎం ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.

నేటి నుంచి శ్రీకల్బుర్గి శరణ బసవేశ్వర పురాణం

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు శ్రీకల్బుర్గి శరణ బసవేశ్వర పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, ఆలయ సేవా సమితి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నిత్యాన్నదానం చేపడుతామన్నారు.

ఉచిత శిక్షణకు నమోదు చేసుకోండి

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ట్రైనింగ్ రెండో విడతలో ఉచిత శిక్షణ నమోదుకు ఈ నెల 3వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ మాధురి తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిగ్యూటీవ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం 8500783459 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రమణీయంగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్ పేరేముల గ్రామంలో శ్రీలక్ష్మీ భూదేవి చెన్నకేశవస్వామి వార్ల కల్యాణం ఆదివారం కడు రమణీయంగా జరిగింది. ఆలయంలో వెలసిన స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలను చేసిన భక్తులు కల్యాణ ఘట్టాన్ని కనులారా తిలకించారు. బుడుముడ్ల చిన్న రంగస్వామి, గొల్ల శేషయ్య, వడ్డె ఈశ్వరయ్య గురువులచే చేపట్టిన కట్టికోలన్న ఆకట్టుకుంది. సోమవారం న్యూకేటగిరి వృషభాలకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ఉపకార వేతనానికి విద్యార్థిని ఎంపిక

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మేఘన నేషనల్ మెన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు (ఎన్ఎంఎంఎస్) ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఆదివారం ఉపాధ్యాయ బృందం అభినందించారు. మేఘనకు ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం వస్తుందన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

చిప్పగిరి: స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫ్మార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదకరంగా మారింది. సమీపంలో కేజీబీవీ పాఠశాల ఉండటం...దాంట్లో పది పరీక్షల కేంద్రం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు అదే దారిలో పోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధించి అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల పండుగ



ఎం.కొట్టాల గ్రామంలో..



మద్దికెరలో మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

వెల్దుర్తి: గుడ్‌ఫ్రైడేకు నాలుగు రోజుల ముందు ప్రభువైన ఏసు జెరూసలెంలో ప్రవేశించిన సందర్భానికి ప్రతీకగా జరుపుకునే మట్టల పండుగను మండలంలోని క్రైస్తవ సోదరులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలకు చెందిన పలు చర్చీల పాస్టర్లు విశ్వాసులతో కలిసి మట్టలు చేతబూని, ఏసును కీర్తిస్తూ పుర వీధుల గుండా సాగారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆలూరు/ఆలూరు రూరల్: మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలూరు మండలంలోని అన్ని చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా ఆలూరు,ఎం.కొట్టాల గ్రామాల్లో ఈత ఆకులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు.

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో క్రైస్తవ సోదరులు ఆదివారం ఈత మట్టలు పట్టుకొని గ్రామ పురవీధులు గుండా ఊరేగింపు నిర్వహించారు. మట్టలు జయమునకు, సంతోషమునకు సూచనలన్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



వెల్దుర్తి రెండో ఏబీఎం చర్చి నుంచి పురవీధుల గుండా ర్యాలీగా సాగుతున్న విశ్వాసులు

వాల్మీకుల అభ్యున్నతికి సీఎం కృషి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



కర్నూలుకు తరలివెళ్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, వాల్మీకి, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆలూరు: వాల్మీకుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో వాల్మీకి కులస్తుల ఎదుగుదలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు అసెంబ్లీలో తీర్మాణం చేయడంపై జిల్లా కేంద్రం కర్నూలులో వాల్మీకులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పేందుకు ఆదివారం చేపట్టిన భారీప్రదర్శన, సభకు ఆలూరు నియోజకవర్గంలో స్థానిక మంత్రి నివాసం నుంచి దాదాపు 500 వాహనాలతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మనూరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ వాల్మీకి కులస్తులను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు, ఎమ్మెల్సీలు, మున్సిపల్ కార్పొరేషన్, జెడ్పీ చైర్మన్లను చేయడమే కాకుండా స్థానిక సంస్థల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ ఇలా అనేక రకాలుగా పదవులు కట్టబెట్టడం చారిత్రక విషయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాల్మీకి కులస్తులకు ఉన్న ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించాలని కోరిన నాయకులను చంద్రబాబునాయుడు మెడపట్టి గెంటేశారని మంత్రి గుర్తుచేశారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తు తీర్మానం చేసి ముఖ్యమంత్రికి రుణ పడి ఉంటామన్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో అన్నింటా వెనుకబడిన వాల్మీకులు రాజకీయాల్లో ఎదిగేందుకు సహకారం అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి వెంట వాల్మీకి కులస్తులందరూ ఉంటారని ఆయన పేర్కొన్నారు. కర్నూలుకు తరలి వెళ్లిన వారిలో మంత్రి సోదరులు నారాయణ స్వామి, గట్టు చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్, సింగిల్ విండో చైర్ పర్సన్ ఈరమ్మ, వైస్ ఎంపీపీ నాగవేణి, వీఆర్‌పీఎస్ నాయకులు రాంభీమ్‌నాయుడు, బీసీ మాదన్న, వెంటేశ్వర్లు, వీరాంజి, హనుమయ్య, వీరేష్, విక్రాంత్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు తదితరులు ఉన్నారు. అదేవిధంగా హాలహర్వి ఎంపీపీ నెట్టకంటెమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ నాగేష్, దేవనకొండ మండల వాల్మీకి ప్రతినిధులు మల్లికార్జున, రాజన్న తదితరులు తరలివెళ్లారు. ఆస్పరి, హొళగుంద, చిప్పగిరి మండలాల నుంచి వాల్మీకులు కర్నూలుకు వెళ్లారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఆలూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సింహాద్రిని గత మూడు రోజుల క్రితం సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత రెండు నెలల క్రితం నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అయితే తన కార్యాలయంలో ఉన్న జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల ఫొటోలను గోడలపై నుంచి తొలగించి అవమానపరిచారు. ఈ విషయాన్ని సహచర అధ్యాపకులు బయటకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో విద్యార్థి సంఘా నాయకులు తదితరులు కలసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గుట్టు చప్పుడు కాకుండా విచారణ నిర్వహించి నివేదికను అధికారులకు అందజేశారు. దీంతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్రప్రభుత్వ విధానాలపై దశలవారీగా ఆందోళన

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఎం నాయకుడు రాముడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు సమావేశంలో నాయకులు బాలరాజు, సమీవుల్లా, సత్యన్న, దాదావలి, లక్ష్మినర్సయ్య, అబ్దుల్లాలు పాల్గొన్నారు.

విజేత కైరుప్పల వృషభాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని నిర్వహించిన గిరక పోటీల్లో ఆస్పరి మండలం కైరుప్పల గ్రామ వృషభాలు విజేతగా నిలిచాయి. ఆదివారం ఈ పోటీలను గ్రామ పెద్ద, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సిబి.జానకీరామిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.20,016లు కైరుప్పల బంట్రోత్ ఎద్దులు, రెండవ బహుమతి రూ.10,016లు గుడేకల్ గ్రామానికి చెందిన నల్లన్న ఎద్దులు, మూడవ బహుమతి రూ.5,016లు కారుమంచి గ్రామానికి చెందిన ఆత్మానంద ఎద్దులు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సిబి.జానకీరామిరెడ్డి

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

హొళగుంద: ఈ నెల 8 నుంచి హొళగుందలో ప్రారంభమయ్యే సాయిబన్న దాదా ఉరుసులో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ చలవాది రంగమ్మ, ఉప సర్పంచ్ మీనాక్షి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ ఆధ్వర్యంలో సాయిబన్న దర్గా పరిసరాల్లో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు జరిగాయి. దర్గా పరిసరాల్లో పొక్‌లెనైతో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు, ఇతర చెత్తచెదారాన్ని తొలగించారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా చర్యలు చేపడుతున్నాని వైఎస్సార్‌సీపీ నాయకులు పంపాపతి, దొడ్డబసప్ప తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాల నిర్వహణలో ప్రత్యేకతను సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజల్లో భాగంగా ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, భండరార్చన, పుష్పార్చన, మహామంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. మొక్కుబడులున్న భక్తులు మెట్లను మోకాళ్లతో ఎక్కుతూ ప్రతి మెట్టుకు టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

మద్దికెర- బొజ్జనాయునిపేట రోడ్డు పనులు పూర్తి

మద్దికెర: మద్దికెర నుంచి మజరా గ్రామమైన బొజ్జనాయునిపేట వరకు రూ.2.75 కోట్లతో చేపట్టిన తారురోడ్డు పనులు ఆదివారం పూర్తయినట్లు ఇరిగేషన్ అభివృద్ధి శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శాంతన్న తెలిపారు. పూర్తయిన రోడ్డు పనులను వారు పరిశీలించారు. 2019 ఎన్నికల ప్రచారంలో గ్రామస్తులు రోడ్డు కావాలని అడగడంతో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సహకారంతో రోడ్డు వేసినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.